సిసోడియా విడుదల

- ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్
- 17 నెలల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి
- నియంతృత్వానికి చెంపపెట్టు: సిసోడియా
- సత్యమే గెలిచింది: ఆప్ హర్షాతిరేకం

'ఈ తీర్పు నియంతృత్వానికి పెద్ద చెంపపెట్టు. ఇందుకు నేను సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. ఏ నియంతృత్వ ప్రభుత్వం కూడా అమాయకుడిని జైలులో పెట్ట లేదు. నాతో మీరూ బాధను అనుభవించారు. ప్రతి స్కూలు విద్యార్థి నేను బయటకు రావాలని ఎదురుచూశారు. ఈ తీర్పు తర్వాత నేను బాబాసాహెబ్ అంబేద్కర్‌కు రుణపడి ఉన్నట్టు అనిపిస్తున్నది. రాజ్యాంగం ద్వారానే ఈ న్యాయపోరాటానికి తార్కిక ముగింపు దక్కింది'.

–మనీశ్ సిసోడియా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయ్యి, 17 నెలలకు పైగా జైలు జీవితం అనుభవిస్తున్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) కీలక నేత మనీశ్ సిసోడియా ఎట్టకేలకు విడుదలయ్యారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ నమోదు చేసిన కేసుల్లో సిసోడియాకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం సిసోడియా తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. అంతకు ముందు.. రూ.10 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో, ఇద్దరు ష్యూరిటీ తీసుకొని ఆయనను విడుదల చేయాలని కోర్టు జైలు అధికారులను ఆదేశించింది. ఈ సందర్భంగా సిసోడియా తన పాస్‌పోర్ట్‌ను అప్పగించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని, ప్రతీ సోమవారం, గురువారం ఏజెన్సీల అధికారుల ముందు హాజరుకావాలని ధర్మాసనం కొన్ని షరతులు విధించింది. కాగా, ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో కిందటేడాది ఫిబ్రవరి 26న సీబీఐ అధికారులు అప్పుడు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సిసోడియాను అరెస్టు చేశారు. అప్పటినుంచి ఆయన జైలులోనే ఉన్నారు.

ఇప్పటికిప్పుడు డిప్యూటీ సీఎం కాబోరు

సీబీఐ అరెస్టు చేసిన రెండు రోజుల తర్వాత సిసోడియా ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అయితే, తాజాగా సిసోడియా జైలు నుంచి విడుదలైనప్పటికీ, ఇప్పటికిప్పుడు ఆయన డిప్యూటీ సీఎం పదవిని చేపట్టబోరని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సిసోడియా సతీమణి ఆరోగ్యం సరిగా లేదని, ఆమె ఆరోగ్యంపైనే ఆయన ప్రధానంగా దృష్టిసారించనున్నారని పార్టీ నేత ఒకరు తెలిపారు.

సిసోడియాకు ఘన స్వాగతం పలికిన ఆప్ కార్యకర్తలు

17 నెలల జైలు జీవితం తర్వాత శుక్రవారం బయటకు వచ్చిన మనీశ్ సిసోడియాకు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు, ఆయన మద్దతుదారులు ఘనంగా స్వాగతం పలికారు. జైలు వద్దకు భారీగా చేరుకొని సిసోడియా రాగానే భుజాలపై ఆయనను ఎత్తుకున్నారు. డీడీయూ మార్గ్‌లోని ఆప్ కార్యాలయంతో పాటు మనీశ్ సిసోడియా ఇంటి వద్దకు కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు చేరుకొని మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

నిజం గెలిచింది.. నిజమే గెలుస్తుంది: ఆప్

మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్ట్ బెయిల్ మంజూరు చేయడంపై ఆమ్ ఆద్మీ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఇవాళ నిజం గెలిచిందని, ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని 'ఎక్స్'లో పేర్కొన్నది. భగవంతుడి సన్నిధిలో ఎప్పుడూ న్యాయం ఉంటుందని కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్ పేర్కొన్నారు. బెయిల్ ప్రకటన వచ్చిన వెంటనే 'సత్యమేవ జయతే' అని ఆప్ నేత, ఢిల్లీ విద్యా శాఖ మంత్రి ఆతిశీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ప్రియమైన చిన్నారులారా.. మీ మనీశ్ మావయ్య తిరిగొచ్చారు' అని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బెయిల్ ఇవ్వాలన్న కోర్టు తీర్పు కేంద్రం నియంతృత్వానికి చెంపపెట్టని మరో ఎంపీ సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు.

ఆహ్వానించదగ్గ పరిణామం

- మనీశ్ సిసోడియా బెయిల్‌పై కేటీఆర్ స్పందన
- అభియోగాలు మోపి ఎన్నాళ్లు జైల్లో ఉంచుతారు?
- నేరం రుజువు కాకుండా దర్యాప్తు పేరుతో జైల్లో ఉంచడం హక్కులను హరించడమే
- కవిత బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశాం

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన ఆప్ నేత మనీశ్ సిసోడియాకు బెయిల్ లభించడం ఆహ్వానించదగ్గ పరిణామం అని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. 17 నెలలుగా మనీశ్ సిసోడియా జైల్లో ఉన్నారని, ఇప్పటివరకూ ఆయనపై మోపిన నేరాభియోగాలను దర్యాప్తు సంస్థలు రుజువు చేయలేకపోయాయని అన్నారు. నేరం రుజువు కాకుండా దర్యాప్తు పేరుతో ఏండ్లకు ఏండ్లు వ్యక్తులను జైల్లో పెట్టడం సరికాదని, దర్యాప్తు ప్రక్రియను వేగంగా ముగించి నిర్దోషులను వదిలేయాలని పేర్కొన్నారు. ఇదొక్క ఢిల్లీ మద్యం కేసు గురించే కాదని.. దేశంలోని అన్ని కేసులకూ ఇది వర్తిస్తుందని అన్నారు. 'జస్టిస్ డిలేయిడ్ ఈజ్ జస్టిస్ డినైయిడ్' అని, ఏండ్లకు ఏండ్లు జైల్లో పెట్టి చివరకు నిర్దోషి అని విడుదల చేస్తే ఉపయోగం ఉండదని పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థలు తమ దర్యాప్తు ప్రక్రియకు కాలపరిమితిని నిర్దేశించుకోవాలని, న్యాయస్థానాలు కూడా కాలపరిమితిని నిర్ధారించి, నిర్దోషులకు ఉపశమనం కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

కవితది రాజకీయ ప్రేరేపిత అరెస్టు

సిసోడియాకు బెయిల్ వచ్చిన నేపథ్యంలో ఇదే కేసులో తన సోదరి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కూడా బెయిల్ వచ్చే అవకాశం ఉందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీ మద్యం కేసులో కవితను అరెస్టు చేయడం కేవలం రాజకీయ ప్రేరేపితమేనని కేటీఆర్ ఆరోపించారు. కవిత బెయిల్ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, సోమవారం లేదా మంగళవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించే అవకాశం ఉందన్నారు. కవిత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌లకు కూడా త్వరలోనే బెయిల్ వస్తుందని భావిస్తున్నామని, వీరు కూడా అరెస్టు అయ్యి సుదీర్ఘకాలం అవుతున్నదని అన్నారు.

కవిత 11 కిలోల బరువు తగ్గారు..

తాను ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లానని, కవితతో ములాఖాత్ అయ్యానని కేటీఆర్ మీడియా ప్రతినిధులతో చెప్పారు. అయిదు నెలల్లో కవిత 11 కిలోల బరువు తగ్గారని, బీపీతో బాధపడుతున్నారని, ఇతర అరోగ్య ఇబ్బందులు కూడా ఉన్నాయని అన్నారు.

విచారణ ఎప్పుడు పూర్తయితది?

- అప్పటిదాకా నిందితుడు జైల్లో మగ్గాల్సిందేనా?
- చార్జిషీట్ల పేరిట ఇంకెంత కాలయాపన చేస్తారు?
- వేగవంతమైన విచారణ కోరడం నిందితుడి హక్కు
- జైలు నుంచి ఉపశమనం పొందే హక్కూ వాళ్లకుంది
- బెయిల్ ఓ నియమం.. జైలు అనేది మినహాయింపు
- ఇది అందరూ గుర్తించాల్సిన సమయం రానేవచ్చింది
- ఢిల్లీ మద్యం కేసులో ఈడీ, సీబీఐకి సుప్రీం తలంటు

జస్టిస్ కేవీ విశ్వనాథన్

జస్టిస్ బీఆర్ గవాయ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియాకు శుక్రవారం బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు.. ఈ కేసు విషయమై ఈడీ, సీబీఐ వైఖరిని తప్పుబట్టింది. ఏదైనా కేసు విషయమై ఏ నిందితుడినీ ఎల్లకాలం జైల్లో ఉంచకూడదని తీవ్ర స్వరంతో హెచ్చరించింది. చార్జిషీట్ల పేరిట కాలయాపన చేస్తున్న ఈడీ, సీబీఐ తీరును ఈ సందర్భంగా ఎండగట్టింది. రెండు ఏజెన్సీల వైఖరితో వేగవంతమైన విచారణ లభించే హక్కును నిందితుడు కోల్పోయాడని ఆగ్రహం వ్యక్తం చేసింది. బెయిల్ అనేది నియమమని, జైలు అనేది మినహాయింపుగా గుర్తించాలంటూ స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం 38 పేజీల తీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది.

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

- ఏ కేసు అయినా కానివ్వండి. నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచకూడదు.
- కేసు విచారణలో పురోగతి లేని సమయంలో లేదా ఒక పరిమితి దాటిన తర్వాత వ్యక్తిని జైల్లో ఉంచడం సరైన చర్య అనిపించుకోదు.
- పైవిషయాలను పక్కనబెట్టి ఆ వ్యక్తిని అలాగే జైల్లో ఉంచాలనుకొంటే.. అది ఆ వ్యక్తి ప్రాథమిక హక్కులను హరించడమే అవుతుంది. వేగవంతమైన విచారణ, స్వేచ్ఛాహక్కు ఎంతో పవిత్రమైన వని గుర్తించాలి.
- బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవడం, జైలు శిక్ష నుంచి ఉపశమనం పొందడం నిందితులకు ఉండే హక్కు.
- 'బెయిల్ అనేది ఓ నియమం.. జైలు అనేది మినహాయింపు' అనే విషయాన్ని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.
- ఇక, ఈ కేసులో సిసోడియా 17 నెలలకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్నారు. విచారణ ఇంకా మొదలు కాలేదని మీరు (ఈడీ, సీబీఐ) ఇప్పుడు చెప్తున్నారు. ఇది ముమ్మాటికీ.. 'వేగవంతమైన విచారణ కోరే హక్కు'ను ఆ వ్యక్తికి (సిసోడియా) దూరం చేయడమే. ఇది ఒకవిధంగా విచారణ లేకుండానే వ్యక్తిని శిక్షించడమే అవుతుంది.
- కేసు తీవ్రమైనదని, నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దని ఏజెన్సీలు చెప్తున్నాయి. అయితే, కేసు అంత తీవ్రమైనప్పుడు వేగవంతమైన విచారణ ఎందుకు చేయలేదు? త్వరితగతిన విచారణ పూర్తిచేయని మీరు (సీబీఐ, ఈడీ) నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దని చెప్పడం సరికాదు.
- ఈ కేసులో 495 మంది సాక్ష్యులు ఉన్నారని చెప్తున్నారు. లక్షల పేజీల ది డాక్యుమెంట్లు సమర్పించారు. ఇలాంటి సమయంలో మీ (సీబీఐ, ఈడీ) విచారణ ఎప్పుడు పూర్తవుతుంది? ఈ సారంగానికి (కేసు) ముగింపు ఎక్కడ ఉంది? అంతవరకూ నిందితుడు జైల్లోనే ఉండాలా? రాజ్యాంగంలో ఆర్టికల్ 21 ప్రకారం.. ఇది నిందితుడి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కును కాలరాయడమే అవుతుంది.
- ఇప్పటికే ఈ కేసులో అన్ని డాక్యుమెంట్లను, ఆధారాలను సేకరించాం అని చెప్తున్నారు. అలాంటప్పుడు నిందితుడు వాటిని ట్యాంపరింగ్ చేసే అవకాశమే లేదు. పైగా నిందితుడు సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి. షరతులతో కూడిన బెయిల్ ఇస్తే తప్పేంటి?
- (ఈడీ, సీబీఐతో..) ఇంతజరిగాక ఇప్పుడు విచారణ వేగవంతం చేస్తామని చెప్తున్నారు. అనుబంధ చార్జిషీట్ దాఖలుకు మరో నెల సమయం కావాలని జూన్ 4న చెప్పారు. మరో 6-8 నెలల్లో విచారణ పూర్తిచేస్తామని 2023 అక్టోబర్‌లో చెప్పారు. మీ స్టేట్‌మెంట్స్ అన్నీ గందరగోళంగా ఉన్నాయి. చార్జిషీట్ల పేరిట కాలయాపన చేయడమేంటి?
- బెయిల్ కోసం సిసోడియా ట్రయల్ కోర్టుకు వెళ్లాల్సిందిగా మీరు (సీబీఐ, ఈడీ) ఇప్పుడు చెప్తున్నారు. ఇదేమైనా వైకుంఠపాళి (స్నేక్స్ అండ్ లాడర్ గేమ్) ఆటనా? బెయిల్ కోసం ట్రయల్ కోర్టు, ఆ తర్వాత హైకోర్టు.. ఇలా దేశంలో పౌరుడు తన వ్యక్తిగత స్వేచ్ఛా హక్కు కోసం కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ తిరుగుతూ ఉండాల్సిందేనా? దీన్ని మేం ఒప్పుకోబోం. అందుకే షరతులతో కూడిన బెయిల్ ఇస్తున్నాం.

ఈడీపై సుప్రీం గరం

ఈడీ వైఖరిపై సుప్రీంకోర్టు గుర్రుగా ఉన్నట్టు అర్థమవుతున్నది. గడిచిన కొద్దిరోజుల్లో జరిగిన కేసుల విచారణే ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. పీఎంఎల్ఏ చట్టం పేరిట ఈడీ దుందుడుకు చర్యలను ఇటీవల విమర్శించిన అత్యున్నత ధర్మాసనం.. అదే పీఎంఎల్ఏ చట్టం కింద ఈడీ నమోదు చేసిన 5 వేల కేసుల్లో నేరారోపణలు రుజువైనవి 40కి మించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా సిసోడియా బెయిల్ పిటిషన్‌పై ఈడీతో పాటు సీబీఐ వైఖరిని తప్పుబట్టింది.

నీట్ అవసరం ఇక ఉండదా?

- 12వ తరగతి కోసం ఎన్‌సీఈఆర్‌టీ ప్రతిపాదన
- 9, 10, 11 తరగతుల మార్కులూ కలిపే విధానం
- అన్ని బోర్డుల్లోనూ ఒకే తరహా మార్కుల వ్యవస్థ
- కేంద్ర విద్యా శాఖకు పరఖ్ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: దేశంలోని ఏ బోర్డు పరిధిలోనైనా ఒకే తరహా మార్కుల వ్యవస్థ ఉండాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన పరఖ్ (పర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్, రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవెలప్‌మెంట్) అన్ని కేంద్ర, రాష్ట్రాల విద్యా బోర్డులను అధ్యయనం చేసి కేంద్ర విద్యా శాఖకు పలు ప్రతిపాదనలు చేసింది. పరీక్షలు, మార్కుల విధానాన్ని అన్ని బోర్డుల పరిధిలో ఒకే తరహాలో మార్చాలని సూచించింది. 12వ తరగతి ఫలితాల్లో 9, 10, 11వ తరగతి ఫలితాలనూ చేర్చడం ద్వారా విద్యార్థుల ప్రతిభను సరిగ్గా ముల్యాంకనం చేయవచ్చని పేర్కొన్నది. ఇందుకుగానూ 12వ తరగతిలో 9వ తరగతి మార్కులపై 15 శాతం, 10వ తరగతిపై 20 శాతం. 11వ తరగతిపై 25 శాతం వెయిటేజీ ఇవ్వాలని, మిగతా 40 శాతాన్ని 12 తరగతి మార్కుల వెయిటేజీ ఉండాలని ప్రతిపాదించింది. ఈ కొత్త విధానం అమలులోకి వస్తే ఇక నీట్, సీయూఈటీ వంటి పరీక్షల అవసరం ఉండకపోవచ్చని విద్యారంగ నిపుణులు భావిస్తున్నారు.

ఏ బోర్డు అయినా ఒకే వ్యవస్థ

రాష్ట్రాలకు ఆయా రాష్ట్రాలు ఏర్పాటు చేసుకున్న విద్యా బోర్డులతో పాటు జాతీయ స్థాయిలో ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, ఎన్ఐఓఎస్ వంటి బోర్డులు ఉన్నాయి. పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల తయారీ, మార్కుల కేటాయింపు వంటివి ఒక్కో బోర్డులో ఒక్క రకంగా ఉంది. ఈ నేపథ్యంలో వివిధ బోర్డులకు చెందిన దాదాపు 18 వేల ప్రశ్నాపత్రాలను పరఖ్ బృందం అధ్యయనం చేసింది. అన్ని బోర్డుల పరిధిలో ఒకే రకమైన విధానాన్ని తీసుకురావాలని, తద్వారా విద్యార్థులు ఒక బోర్డు పరిధి నుంచి ఇంకో బోర్డు పరిధిలోకి మారడం సులువు అవుతుందని ప్రతిపాదించింది.

నీట్-పీజీ వాయిదా వేయలేం

విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టలేం

పిటిషన్‌ను తిరస్కరించిన సర్వోన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: నీట్-పీజీ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ నెల 11న జరగనున్న ఈ పరీక్షకు పలువురు అభ్యర్థులకు దూరప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారని పేర్కొంటూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం తిరస్కరించింది. 'ఇలాంటి పరీక్షను మేము ఎలా వాయిదా వేయగలం. ఈ రోజుల్లో కొందరు కేవలం పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ వస్తున్నారు. మేము విద్యా సంబంధ నిపుణులం కాదు. ఈ పరీక్ష షెడ్యూల్‌ను మార్చలేం. పరీక్షను వాయిదా వేస్తే వారాంతంలో రెండు లక్షల మంది విద్యార్థులు, నాలుగు లక్షల మంది తల్లిదండ్రులు రోదించాల్సి వస్తుంది. ఇంతమంది అభ్యర్థుల కెరీర్‌ను ప్రమాదంలో పెట్టలేం. ఈ పిటిషన్ల వెనుక ఎవరున్నారో మాకు తెలియదు' అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, ఈ పరీక్ష జూన్ 23న జరగాల్సి ఉండగా, పోటీ పరీక్షల్లో అక్రమాల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా కేంద్ర వైద్య శాఖ పరీక్షను వాయిదా వేసింది.

'హిజాబ్‌పై నిషేధం సరికాదు'

న్యూఢిల్లీ: కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థినులు హిజాబ్, బురఖా, టోపీ, నఖాబ్ వంటి వాటిని ధరించడంపై నిషేధం విధిస్తూ ముంబైలోని ఓ కళాశాల ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. విద్యా సంస్థలు నిబంధనలను వాటి ఇష్టానుసారం విద్యార్థులపై బలవంతం చేయకూడదని, ఏ దుస్తులు ధరించాలనే విషయంలో విద్యార్థినులకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజీవ్ కుమార్ ధర్మాసనం స్పష్టం చేసింది. విద్యార్థుల మతపరమైన విశ్వాసాలు బయటకు తెలియకుండా ఉండాలని భావిస్తే నుదుటన బొట్టు లేదా తిలకం పెట్టుకోవడంపై ఎందుకు నిషేధం విధించలేదని ప్రశ్నించింది.

క్రిమీలేయర్‌కు కేంద్రం 'నో'

- రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రిమీలేయర్ అనే నియమం లేదు
- రాజ్యాంగం మేరకే నడుచుకోవాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 9: రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లో క్రిమీలేయర్ నియమం లేదని కేంద్ర మంత్రివర్గం శుక్రవారం స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లలో క్రిమీలేయర్ విధానం ఉండాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పులో చేసిన సూచనలపై శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగినట్టు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాజ్యాంగ నిబంధనలకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ విషయంలో రాజ్యాంగం మేరకు ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు.

పలు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

దేశంలో రూ.24,657 కోట్ల అంచనాతో ఎనిమిది రైల్వే ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపినట్టు అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహా ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 14 జిల్లాల పరిధిలో ఈ ప్రాజెక్టులు వస్తాయని, 900 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ వస్తుందని తెలిపారు.

'పీఎంఏవై-జీ'కి ఆమోదం

గ్రామీణ ప్రాంతాల్లో రానున్న ఐదేండ్లలో రెండు కోట్ల ఇండ్లు నిర్మించాలనే లక్ష్యంతో చేపట్టనున్న ప్రధానమంత్రి అవాస్ యోజన - గ్రామీణ(పీఎంఏవై-జీ) పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కాగా, దేశంలో ఉద్యాన రంగాన్ని పెంపొందించేందుకు రూ.1,766 కోట్ల వ్యయంతో క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్(సీపీపీ)ను క్యాబినెట్ ఆమోదించింది.

క్రిమీలేయర్‌పై ప్రధానితో బీజేపీ ఎంపీల భేటీ

ఎస్సీ, ఎస్టీలలో క్రిమీలేయర్‌కు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవలి వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ ఎస్సీ, ఎస్టీ ఎంపీల బృందం శుక్రవారం ప్రధాని మోదీతో సమావేశమై ఆందోళన వ్యక్తం చేసింది.

ధన్‌కర్ వర్సెస్ జయాబచ్చన్

- పేరు విషయంలో మరోసారి వాగ్వాదం
- 'టోన్' ఆమోదనీయంగా లేదన్న ఎంపీ
- 'ఇక చాలు' అని ఆగ్రహించిన చైర్మన్

న్యూఢిల్లీ: రాజ్యసభలో శుక్రవారం చైర్మన్ జగదీప్ ధన్‌కర్, ఎంపీ జయాబచ్చన్ మధ్య పేరు విషయంలో మరోసారి వాగ్వాదం చోటుచేసుకొన్నది. కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేపై బీజేపీ ఎంపీ ఘనశ్యామ్ తివారీ చేసిన వ్యాఖ్యలపై చైర్మన్, విపక్ష సభ్యుల మధ్య చర్చ జరుగుతున్న క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయాబచ్చన్ మాట్లాడేందుకు అవకాశం కోరారు. దీనికి చైర్మన్ ధన్‌కర్ అనుమతిస్తూ 'జయా అమితాబ్ బచ్చన్ మీ పాయింట్ ఏంటో చెప్పండి' అని అన్నారు. తనను జయా అమితాబ్ బచ్చన్ అని సంబోధించడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నేను జయా అమితాబ్ బచ్చన్‌ను ఒకటి చెప్పాలని అనుకొంటున్నా.. మీ గొంతు టోన్ ఆమోదనీయంగా లేదు. నేను ఒక ఆర్టిస్టును. బాడీ లాంగ్వేజ్, వ్యక్తీకరణలను నేను అర్థం చేసుకోగలను' అంటూ మాట్లాడుతుండగా జోక్యం చేసుకొన్న చైర్మన్ ధన్‌కర్ 'ఇక చాలు' అని అన్నారు. 'మీరు సెలబ్రిటీ కావొచ్చు లేదా మరెవరైనా కావొచ్చు. మీరు మంచి ప్రవర్తనను పాటించాల్సిందే' అని పేర్కొన్నారు. జయాబచ్చన్ ఒక సీనియర్ ఎంపీ అని, చైర్మన్ ఆమెను ఒక సెలబ్రిటీ అని ఎలా పిలుస్తారని విపక్ష పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ధన్‌కర్, జయాబచ్చన్ మధ్య వాగ్వాదం తర్వాత ప్రతిపక్ష పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయి. గత 10 రోజుల వ్యవధిలో ఆమె పేరు విషయంలో వాగ్వాదం జరగడం ఇది మూడోసారి.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. లోక్‌సభ, రాజ్యసభలను స్పీకర్, చైర్మన్‌ను నిరవధిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 12 వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగాల్సి ఉండగా, మూడు రోజుల ముందుగానే నిరవధికంగా వాయిదా పడటం గమనార్హం. ఈ సమావేశాల్లో వక్ఫ్ చట్టం-1995ను సవరిస్తూ కేంద్రం ఓ బిల్లును ప్రవేశపెట్టడంపై వివాదం రేగిన విషయం తెలిసిందే.

ఉపరాష్ట్రపతిపై అభిశంసన తీర్మానం?

ఉప రాష్ట్రపతిగా జగదీప్ ధన్‌కర్‌ను తొలగించేలా అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్ష ఇండియా కూటమి పార్టీలు యోచిస్తున్నాయి. ఇందుకు సంబంధించి నోటీసు సమర్పించే సమయంపై పార్టీలు చర్చించనున్నాయని, తీర్మానం ఆమోదం పొందకపోయినప్పటికీ, సభలో చైర్మన్ ధనకర్ పక్షపాత తీరును హైలెట్ చేసినట్టు అవుతుందని భావిస్తున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. విపక్ష నేతల మైక్‌ను పదేపదే కట్ చేస్తున్నారని, రూల్స్‌కు అనుగుణంగా సభ నడవడం లేదని విపక్ష పార్టీలు అంటున్నాయి.

NCL INDUSTRIES LTD

NCL GROUP
AN ISO 9001 : 2015 COMPANY

7th Floor, NCL Pearl, Near Rail Nilayam, SD Road, Secunderabad - 500026
CIN: L33130TG1979PLC002521 www.nclind.com

EXTRACT OF UNAUDITED STANDALONE AND CONSOLIDATED FINANCIAL RESULTS FOR THE QUARTER ENDED 30TH JUNE 2024

(₹ In Lakhs)

PARTICULARS	STANDALONE				CONSOLIDATED			
	Quarter ended 30.06.2024	Quarter ended 31.03.2024	Quarter ended 30.06.2023	Year ended 31.03.2024	Quarter ended 30.06.2024	Quarter ended 31.03.2024	Quarter ended 30.06.2023	Year ended 31.03.2024
	(Unaudited)	(Audited)	(Unaudited)	(Audited)	(Unaudited)	(Audited)	(Unaudited)	(Audited)
Total Income	35,846.99	42,486.46	40,566.55	1,66,162.34	35,847.29	42,551.79	40,566.55	1,66,230.30
Net Profit for the period (before tax and Exceptional Items)	2,138.33	3,375.62	4,943.46	14,764.84	2,121.36	3,355.63	4,921.71	14,866.48
Net Profit for the period before tax (after Exceptional items)	2,138.33	3,375.62	4,943.46	14,764.84	2,121.36	3,355.63	4,921.71	14,866.48
Net Profit for the period after tax (after Exceptional items)	1,293.53	2,417.91	3,107.97	9,420.22	1,276.56	2,397.92	3,086.22	9,321.86
Total Comprehensive Income (Net of tax) for the period	1,293.53	2,376.81	3,107.97	9,379.13	1,276.56	2,356.82	3,086.22	9,280.77
Paid up Equity Share Capital (Face Value of Rs. 10/- Each)	4,523.28	4,523.28	4,523.28	4,523.28	4,523.28	4,523.28	4,523.28	4,523.28
Reserves (excluding Revaluation Reserve as shown in the Balance Sheet of Previous year)				80,982.58				80,386.83
Earnings per Share (of Rs.10/-each) (not annualised) Basic & Diluted	2.86	5.25	6.87	20.74	2.82	5.19	6.82	20.50

1. The above results for the quarter ended 30th June 2024 have been prepared in accordance with Indian Accounting Standards ("Ind AS") prescribed under section 133 of the Companies Act 2013 ("the Act") read with the relevant rules issued thereunder and other accounting principles generally accepted in India and the guidelines issued by SEB